క్లుప్తంగా

'ఫ్యామిలీ డాక్టర్' గ్రామీణులకు వరం



గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మి

బొమ్మనహాళ్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గ్రామీణులకు వరమని పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రీలక్ష్మి అన్నారు.శనివారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌సీ రుక్మిణీ, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాభి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



ఇప్పేరులో సర్వే చేపడుతున్న తహసీల్దార్ శేషారెడ్డి

కూడేరు: జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం ద్వారా చేపడుతున్న రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ శేషారెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పేరులో శనివారం రీసర్వే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో భూరికార్డులను ఎవరూ తారుమారు చేయకుండా భూమికి సంబంధించిన డిజిటల్ రికార్డులను తయారు చేస్తామన్నారు. సమగ్ర రీసర్వే పూర్తయిన తర్వాత భూముల రిజిస్ట్రేషన్ చేస్తారని, క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ టైటిల్ కార్డులను భూయజమానికి అందజేస్తామన్నారు. రీ సర్వేని పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఓబులేసు, వీఆర్వో రవికాంత్, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు



క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందిస్తున్న లయన్స్ సభ్యులు

ఉరవకొండ: స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో క్షయవ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను శనివారం అందించారు. క్లబ్ ఇమ్మిడియేట్ ఫాస్ట్ పీఎస్‌టీ అధ్యక్షుడు సప్తగిరి మల్లికార్జున కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడు క్షయవ్యాధిగ్రస్తులకు భవిష్యత్‌లో లయన్స్ క్లబ్ తరుపున మరింత సహకారం అందిస్తామన్నారు. వరుసగా ఆరోసారి పౌష్టికాహార కిట్లను వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమక్షంలో అందించామన్నారు. అనంతరం అధ్యక్షుడిని లయన్స్ సభ్యులు ఘనంగా సత్కరించారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు అంజన్నకు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలు, పుష్పాలతో శోభాయమానంగా అలకరించారు. ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు వేకువజాము నుంచే స్వామికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తలసీమియా బాధితుడికి అండ

శెట్టూరు: మండల కేంద్రానికి చెందిన సత్యదేవ్ పుట్టినప్పటి నుంచి తలసీమియా వ్యాధితో బాధపడుతున్నాడు. గత 14 ఏళ్లుగా ఎలాంటి ఆర్థిక భరోసా అందలేదు. తండ్రి తిప్పేస్వామి బారా మసాలా అమ్ముకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. తల్లి భాగ్యమ్మ సత్యదేవ్ బాగుగోలు చూసుకుంటూ కూలీ పనులకు వెళ్లేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ మహంతేష్ వారి ఇంటికి వెళ్లి సదరం సర్టిఫికెట్ కోసం అనంతపురంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి బాలుడిని తీసుకెళ్లాడు. సర్టిఫికెట్ వచ్చిన వెంటనే సచివాలయంలో పింఛనుకు దరఖాస్తు చేశాడు. ప్రస్తుతం నెలకు రూ.10 వేలు పింఛను అందుతోంది.



తలసీమియాతో బాధపడుతున్న సత్యదేవ్‌కు పింఛను అందజేస్తున్న వలంటీర్ మహంతేష్

వలంటీర్ కన్న కొడుకులా ఆదుకున్నాడు



మేం కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. మాకు చదువు రాదు. సదరం సర్టిఫికెట్ కోసం ఎక్కడకు పోవాలో కూడా తెలియని పరిస్థితి. వలంటీర్ మహంతేష్ కొడుకులా మమ్మల్ని ఆదుకున్నాడు. మాతో పాటు అనంతపురం డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి వచ్చి సదరం సర్టిఫికెట్ వచ్చేలా చేశాడు. దీంతో ప్రతి నెలా మా కుమారుడికి రూ.10 వేలు పింఛను వస్తోందిది. ఇప్పుడు ఆసుపత్రి ఖర్చులకు ఎలాంటి ఇబ్బంది లేదు. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– భాగ్యమ్మ, సత్యదేవ్ తల్లి

వలంటీర్లకు వందనం

ధైర్యంగా సేవలు

బెళుగుప్ప: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో వలంటీర్లు నిత్యం విధులు నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో ఇంట్లో వాళ్లు సైతం పట్టించుకోకున్నా.. వలంటీర్లు లాక్‌డౌన్ సమయంలో ధైర్యంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి కరోనా రోగులకు కావాల్సిన నిత్యావసర సరుకులను సమకూర్చారు. క్వారంటైన్‌లోకి వెళ్లి భోజనాలు అందించారు. అలాగే ఇంటింటికీ తిరిగి కరోనాపై అవగాహన కల్పించారు. గ్రామస్తులకు మాస్కులు అందజేశారు. అలాగే అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఒకటో తేదీ తెల్లవారక మునుపే తలుపు తట్టి పింఛన్ అందజేస్తూ ప్రసంశలు అందుకుంటున్నారు.



కరోనా విపత్కర పరిస్థితుల్లో క్వారంటైన్ కేంద్రంలో ఉన్న తిప్పేస్వామికి ఆహారం అందిస్తున్న వలంటీర్ సుధాకర్‌రెడ్డి (ఫైల్)

వలంటీర్ సేవలు మరువలేనివి



కరోనా బారిన పడిన నాకు వలంటీర్ సుధాకర్‌రెడ్డి అందించిన సేవలు మరువ లేనివి. కరోనా సోకడంతో గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రానికి నిత్యం వస్తూ 14 రోజులు ఆహారాన్ని అందించారు. విపత్కర పరిస్థితుల్లో వలంటీర్ సేవలు అద్భుతం. వలంటీర్ లేకుంటే నా పరిస్థితి ఉలా ఉండేదో తలచుకుంటనే భయమేస్తుంది. వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– తిప్పేస్వామి, రామసాగరం గ్రామం, బెళుగుప్ప

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ దాసానాయక్

బ్రహ్మసముద్రం: మండలంలోని సంతేకొండాపురంలో ఉన్న అంగన వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ దాసానాయక్ , ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని రుచి చూశారు. ఆహారం నాణ్యత పెంచాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, పంచాయతీ కార్యదర్శి అనిత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి అదృశ్యం

అనంతపురం శ్రీకంఠం సర్కిల్: శ్రీసాగర్ కాలనీకి చెందిన ఉపాధ్యాయుడు రమేష్ నాయక్ శుక్రవారం నుంచి కనిపించలేదని భార్య సరస్వతి (ఉపాధ్యాయిని) పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. బెళుగుప్పలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రమేష్‌నాయక్ కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని ఆమె పోలీసులను ఆశ్రయించింది.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



హాజరైన నాయకులు, కార్యకర్తలు

కళ్యాణదుర్గం: సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఉదయం మున్సిపాలిటీలోని 11,12,13,14 వార్డుల పరిధిలో, మధ్యాహ్నం 15,16,17,18 వార్డుల పరిధిలోని కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయ వార్డుల్లో పార్టీని మరింతగా బలోపేతం చేయాలని మంత్రి సూచించారు. వార్డుల వారీగా వలంటీర్ల పరిధిలోని 50 ఇళ్లలో నాలుగేళ్లలో ఇంటింటికీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. రాబోవు రోజుల్లో మరింత అభివృద్ధి జరుగుతుందని తెలియజేయాలన్నారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా సంక్షేమ పథకాలను నేరుగా ప్రజల ఖాతాలకే జమచేస్తున్న తీరును వివరించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ క్యాలెండర్‌తో పేదలకు మంచి రోజులు వచ్చాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పొందిన లబ్ధి...వైఎస్సార్ సీపీ హయాంలో జరిగిన లబ్ధి తేడాలను ప్రజలకు క్షుణ్ణంగా తెలపాలన్నారు. అనంతరం ఆయా వార్డుల అభివృద్ధికి చేపట్టాల్సిన పలు చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మాజీ కన్వీనర్ తిరుమల వెంకటేశులు, ఆయా వార్డుల నాయకులు ఉమాపతి, హేమ, మారుతి, రామాంజనేయులు, తిమ్మక్క, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతాశయం కోసం ఇష్టంతో చదవండి

రాయదుర్గం రూరల్: తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చడం కోసం విద్యార్థులు ఉన్నతాశయంతో ముందడుగు వేయాలని, ఇష్టంతో కష్టపడి చదవాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సూచించారు. మండలంలోని 74 ఉడేగోళం కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తానిచ్చిన రూ.2.03 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదిని సతీమణి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతితో కలసి విప్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సెమినార్ హాల్‌లో ప్రిన్సిపాల్ రఘురామమూర్తి అధ్యక్షతన ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో విప్ మాట్లాడారు. తాను రాజకీయాల్లోకి రాక మునుపే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశానన్నారు. కళాశాల అభివృద్ధిలో భాగంగా మొట్టమొదటగా కంప్యూటర్లు వితరణ చేశానన్నారు. కళాశాల విద్యార్థుల ప్రయాణ సౌకర్యార్థమై సొంతంగా బస్సు కూడా ఏర్పాటు చేసి, ఏళ్ల తరబడి నడిపామన్నారు. అయితే కొంతమంది దుర్మార్గులు నాకు మంచి పేరు రావడం సహించలేక వివిధ కారణాలతో వాటిని నిలిపివేయించారన్నారు. కాపు భారతి మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా కళాశాల అభివృద్ధిలో పాలుపంచుకుంటామన్నారు. ప్రిన్సిపాల్ రఘురామ మూర్తి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో విప్ పాత్ర అనిర్వచనీయమన్నారు. అనంతరం కళాశాల అధ్యాపక బృందం కాపు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ చైర్మన్ బసవరాజు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, పట్టణ కన్వీనర్ ముస్తాక్, కౌన్సిలర్లు డిష్ గోవిందు, వన్నూరప్ప, గంగాధర, ఉలుగప్ప, సీఐ లక్ష్మణ్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కళాశాలలో అదనపు తరగతి గదిని ప్రారంభిస్తున్న కాపు రామచంద్రారెడ్డి దంపతులు

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



రాయదుర్గం రూరల్: లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ: రేణుమాకులపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

- గడప గడపలో ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ

రాయదుర్గం రూరల్/కణేకల్లు: పేదల సంక్షేమమే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. రాయదుర్గం మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలోని పేద ప్రజలకు జరిగిన మేలు దేశ చరిత్రలోనే ఎక్కడా జరగలేదన్నారు. పాదయాత్రలో వైఎస్ జగన్ స్వయంగా విన్న పేదప్రజల ఆవేదనలే నవరత్నాల రూపకల్పనకు మార్గదర్శకాలన్నారు. మేనిఫెస్టోను అమలు పరచి 98 శాతం హామీలను నెరవేర్చి , రాజకీయ నాయకులకే విలువ పెంచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. పచ్చమీడియాను అడ్డుపెట్టుకుని వైఎస్ జగన్‌పై చంద్రబాబు లేనిపోని ఆరోపణలు చేసి లబ్ధి పొందాలని చూస్తున్నాడన్నారు. సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, ఎర్రప్ప, తిమ్మరాజు, తిప్పేస్వామి, మంజునాథ , విజయ్ రెడ్డి, పవన్ , వంకాయల నాగప్ప, కోట గోవింద, ఎర్రెడ్డి, రామాచారి, శివలింగ, మల్లయ్య, వీరేష్ , గోవర్ధన్ , కృష్ణ, ఆటో కుమార్ , తహసీల్దార్ మారుతి, ఎంపీడీఓ కొండయ్య, పంచాయితీ కార్యదర్శి బసవరాజు , సీఐ లక్ష్మణ్ణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు , పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- కణేకల్లు మండలంలోని ఆదిగానిపల్లి గ్రామంలో శనివారం 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేశులుతో కలిసి విప్ ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ బుక్‌లెట్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఏ పథకం కావాలన్న జన్మభూమి కమిటీ సిఫార్సు ఉండాలి... వారి సిఫార్సు కావాలంటే అడిగినంత ఇచ్చుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. వలంటీర్లు పేదల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందజేసున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

ఆదిగానిపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు చిన్న కెంచన్న, చిక్కణ్ణయ్య, వన్నప్ప వైఎస్సార్‌సీపీలో చేరారు. విప్ కాపు వారికి పార్టీ కండువా వేసి స్వాగతించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు వెంకటేశులు, వైస్ సర్పంచు హనుమంతు, స్థానిక నాయకులు వెంకటరాము, నగేష్, డీలర్ వెంకటేశులు, గోపాల్, రచ్చుమర్రి వెంకటేశులు, మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, కణేకల్లు పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న, సర్పంచులు భాస్కర్‌రెడ్డి, ప్రకాష్‌చౌదరి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ ఛైర్మన్ యంత్రకాయల వన్నూరప్ప, కెనిగుంట రామిరెడ్డి, పుల్లంపల్లి పెద్దిరెడ్డి, ఎర్రిస్వామి, చిన్న సర్మస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేణుమాకులపల్లిలో అపూర్వ ఆదరణ

ఉరవకొండ: మండలంలోని రేణుమాకులపల్లిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి శనివారం అపూర్వ ఆదరణ లభించింది. గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీరభద్రగౌడ్, పెద్దమల్లప్ప, జగదీష్, బీసీ లింగన్న, సుదప్ప, హరీష్, ఎర్రిస్వామి, గోపాల్, ఓబుళపతి, పురుషోత్తం, మారుతిప్రసాద్, ఎంపీపీ చంద్రమ్మ. జడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వీరన్న, వైఎస్ ఎంపీపీ నరసింహులు, కురుబ కార్పోరేషన్ డైరెక్టర్ గోవిందు, పార్టీ రాష్ట్ర నాయకులు అశోక్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, జేసీఎస్ కన్వీనర్ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబూ.. వలంటీర్ల పై ఇంత దిగజారి మాట్లాడుతావా..!

చెప్పు తీసుకుని కొట్టే వారు లేక ప్రభుత్వ సర్వేల పై పేరుతో వలంటీర్లు వివరాలు సేకరిస్తున్నారని ప్రతిపక్ష నేత చంద్రబాబు చేసిన వాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మండలంలోని రేణుమాకుపల్లిలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబూ.. నీ కొడుకు, కోడలు, మనవుడు, మనవరాలు వయస్సు ఉన్న వలంటీర్లను చెప్పుతో కొట్టాలని చెప్పడానికి నీకు సిగ్గుగా లేదా అని ప్రశ్నించారు. వలంటీర్లపై చంద్రబాబు చేసిన వాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలా దిగజారి మాట్లాడటమే నా నీ 40 ఏళ్ల రాజకీయ అనుభవం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుకు వయస్సు పెరిగే కొద్ది బుద్ధి మందగిస్తోందన్నారు. మొన్న పవన్‌కళ్యాణ్, ఈరోజు చంద్రబాబు వలంటీర్ల వ్యవస్థపై దిగజారి మాట్లాడటం మంచిది కాదన్నారు. వలంటీర్లపై అభాండాలు వేస్తే ప్రజలే చంద్రబాబు, పవన్‌కు బుద్ధి చెబుతారన్నారు.

'జగనన్న సురక్ష'తో అర్హులందరికీ న్యాయం



రాయదుర్గం టౌన్: మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



ఉరవకొండ: లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



వజ్రకరూరు: కొనకొండ్లలో సర్టిఫికెట్లు అందుకున్న వారితో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

రాయదుర్గంటౌన్: దేశంలోనే ఎక్కడా లేని విధంగా విప్లవాత్మక మార్పులకు నాంది పలికేలా 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా వివిధ రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందజేస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని 1, 16, 17, 18 సచివాలయాల పరిధిలోని వార్డులకు సంబంధించి శాంతినగర్‌లోని బన్నీ మహంకాళి ఆలయం వద్ద, పార్వతీనగర్‌లో కౌన్సిలర్ల అధ్యక్షతన శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విప్‌తోపాటు మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. విప్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనతో ఏం చేయాలో తోచక టీడీపీ, జనసేన పార్టీలు చౌకబారు, దుర్మార్గపు రాజకీయాలకు పాల్పడుతున్నట్లు విమర్శించారు. ఐదేళ్లు మంత్రిగా ఉన్న కాలవ శ్రీనివాసులు రాయదుర్గం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు.. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని, ఈ వ్యవస్థలను లేకుండా చేయాలనే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా జగన్ పాలనలో టీడీపీ, జనసేన శాశ్వతంగా కొట్టుకుపోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, ప్రత్యేక అధికారి వరప్రసాద్, వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మాధవరెడ్డి, పట్టణ కన్వీనర్ ముస్తాక్, కౌన్సిలర్లు తాడూరు భాగ్య, గోరంట్ల ఉష, గోవిందరాజులు, భీమనపల్లి నాగవేణి, శారదాదేవి, శ్రీలక్ష్మి, పెద్ద వన్నూరుస్వామి, శివపుత్ర, ఫక్రుద్దీన్, కో ఆప్షన్ సభ్యుడు నజీర్, వార్డు ఇన్‌చార్జ్‌లు దివాకర్, పొరాళ్ల శివకుమార్, కృష్ణమూర్తి, గోరంట్ల సత్యనారాయణ, సునార్ ఇస్మాయిల్, వైజాగ్ రబ్బా, శివప్ప, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు వేగవంతం

ఉరవకొండ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పౌరసేవలన్నీ వేగవంతంగా అందుతాయని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఉన్న సచివాలయం–2 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై దాదాపు 300 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు పొందిన లబ్ధిదారుల సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, ఎంపీటీసీ ఈడిగప్రసాద్, వార్డు సభ్యురాలు ఓబుళమ్మ, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరంబాషా, ఎంపీడీఓ చంద్రమౌళి, నాయకులు ముండాసు ఓబుళేసు, ఆసీఫ్, పామిడిసలీం, అన్వర్ తదితరుల పాల్గొన్నారు.

రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయం

వజ్రకరూరు: జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయంగా నిలుస్తుందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొనకొండ్ల గ్రామ సచివాలయం వద్ద సర్పంచు ఇందిరమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న సురక్ష క్యాలెండర్‌ను ప్రజాప్రతినిధులు,అధికారులతో కలసి ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. అనంతరం గ్రామ సచివాలయం (2 ,3) పరిధిలోని 1,644 మందికి 11 రకాల సర్టిఫికెట్లను ఎమ్మెల్సీ అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. సీఎం జగన్‌ను వస్తున్న ఆదరణను చేసి ఓర్వలేక ప్రతిపక్షాలు అసత్య ఆరోపణలు చేస్తూ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నాయన్నారు. కొనకొండ్ల గ్రామంలో అర్హులైన పేదలందరికి ఇంటిస్థలాలు ఇచ్చేందుకు 20 ఎకరాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకానికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమావత్‌దేవి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, సచివాలయ కన్వీనర్ వడ్డె లింగరాజు, మాజీ ఎంపీపీ రామచంద్ర, నాయకులు లాలెప్ప, చుక్కారాజు, గురు, మునీంద్ర, చుక్కా మల్లికార్జున, చిరంజీవి, వంశీ, కుమ్మర అంజి, శ్రీరాములు, హనుమ ంతు, పెద్దరాజు, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయలలిత, ఈఓఆర్డీ సదాశివ, గ్రామ కార్యదర్శి మురళి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు/బ్రహ్మసముద్రం/కంబదూరు/గుమ్మఘట్ట: కూడేరు మండలంలోని మరుట్ల సచివాలయం వద్ద నిర్వహించినజగనన్న సురక్ష కార్యక్రలో సర్పంచులు లావణ్య, సువర్ణ, ఎంపీటీసీ సభ్యురాలు ఓబుళమ్మ, ఎంపీడీఓ ఎంకే బాషా, తహసీల్దార్ శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మసముద్రం మండలంలోని సంతే కొండాపురం గ్రామ సచివాలయంలో ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, ఎంపీడీఓ దాసానాయక్ , తహసీల్దార్ బాలకిషన్ , ఏఓ నందకిశోర్ పాల్గొన్నారు. కంబదూరు మండంలోని కురాకులపల్లిలో ఎంపీడీఓ సుధాకర్ రాజు, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. బొమ్మనహాళ్ మండలంలోని శ్రీధరఘట్ట సచివాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ షకీలాబేగం, సర్పంచ్ యోగేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, ఈఓపీఆర్డీ విజయమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గుమ్మఘట్ట మండలంలోని కలుగోడు–1, కలుగోడు –2 గ్రామ సచివాలయాల్లో ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచ్ కవిత, డిప్యూటీ తహసీల్దార్ రఘు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించండి



మాట్లాడుతున్న డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి

కూడేరు: చేసిన పనులకు నేమ్ బోర్డులు ఏర్పాటు చేయలేదు..హార్టికల్చర్ కింద చేపట్టిన మొక్కల పెంపకంలో పలు చోట్ల మొక్కలే లేవ్. ఇలాగైతే ఎలా..?. విధులను బాధ్యతగా నిర్వర్తించాలని మండల ఉపాధి సిబ్బందికి డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. మండలంలో 2022–23లో ఉపాధి నిధులు రూ.4 కోట్లతో హార్టికల్చర్, ఉపాధి హామీ పథకం, రూ.2.5 కోట్లతో పంచాయతీ రాజ్ శాఖల కింద చేపట్టిన పనులపై ఈ నెల 12 నుంచి 14 వరకూ సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ నారాయణ రెడ్డి అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ రీసోర్స్ పర్సన్స్ కేశవ్, వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలను ప్రజావేదికలో డీఆర్పీలు వివరించారు. పలు పంచాయతీల్లో హార్టికల్చర్ కింద మొక్కలు నాటినట్లు రికార్డుల్లో పొందుపరచినా కొన్నిచోట్ల మొక్కలు లేవని, తవ్విన గుంతలు కనిపించలేదని, మస్టర్ల నమోదు సరిగాలేదని తద్వారా సుమారు రూ.7 లక్షలు దుర్వినియోగమైందన్నారు. పీడీ విచారణ జరిపి రూ.21529 రికవరీకి పెట్టారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, అంబుడ్స్‌మెన్ మధుసూదన్, ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా, ఏపీఓ తులసీ ప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీకి ఎంపిక


కాపు అక్షయ

వజ్రకరూరు: మండల కేంద్రంలోని కాపు అక్షయ అనే విద్యార్థిని నూ జువీడులోని త్రిపుల్ ఐటీకి ఎంపికైంది. విద్యార్థిని ఎంపిక కావడంపై తల్లిదండ్రులు ఆదర్శ పాఠశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రామలక్ష్మి సంతోషం వ్యక్తం చేస్తూ శనివారం స్వీట్లు పంచారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



వజ్రకరూరు: ఎస్‌ఐగా కె.రాజశేఖర్ శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుల్, పోలీసులు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నూతన ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.






వ్రతానికి హాజరైన మహిళలు

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం

కళ్యాణదుర్గం: స్థానిక లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఏడు శనివారాల వ్రతం, పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటి నుంచి సెప్టెంబర్ 9వ తేదీ వరకూ ఏడు శనివారాలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు కమిటీ పేర్కొంది. అదేవిధంగా ఆగస్టు 18న కుబేర లక్ష్మీవ్రతం, 28న శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీవారికి విశేష అభిషేకం, విశేష అలంకారం పూజలను నిర్వహించనున్నారు. పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కమిటీ పేర్కొంది.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ మారుతి

రాయదుర్గం రూరల్: గత సమావేశాల్లో ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు మీ దృష్టికి తెచ్చిన ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఎంపీపీ విద్యావతి అధికారులను కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు – భూ రీసర్వే గురించి తహసీల్దార్ మారుతి వివరించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రీసర్వేకు శ్రీకారం చుట్టాడన్నారు. అందులో భాగంగా మండలంలో ఇదివరకే ఐదు గ్రామాల్లో భూ రీసర్వే పూర్తయిందన్నారు. మిగిలిన గ్రామాల్లో ఆగస్టు 1 నుంచి రీసర్వే ప్రారంభం అవుతుందన్నారు. అలాగే ఎస్సీ శ్మశాన వాటికల కోసం భూ సేకరణకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ ఖరీఫ్ లో ఇప్పటి వరకు 4,990 హెక్టార్లలో వేరుశనగ, పత్తి, ఆముదం, మొక్కజొన్న, కర్బూజా, టమాట, మిరప పంటలు సాగు చేసినట్లు ఏఓ మహేంద్ర తెలిపారు. ఈ నెల దాటితే వేరుశనగ పంటసాగుకు అనువుగా ఉండదన్నారు. చిరుధాన్యాల సాగు వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. పీఎం కిసాన్ కోసం ప్రతి రైతూ ఈనెల 31 లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కొండయ్య, మండల ప్రత్యేకాధికారి నాగరాజురావు , ఏఓ చిక్కణ్ణ, ఎంఈఓ నాగమణి, ఎంఈఓ 2 వెంకటరమేష్ , ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, హౌసింగ్ ఏఈ అనిల్ కుమార్, ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యుడు మాధవ్ కుమార్ , ఏపీఓ నీరజ, ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వరి, కంది,పెసర విత్తనాలు

కూడేరు: బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వద్ద ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రంలో మేలైన వరి, కంది, పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి విజయ కుమార్ శనివారం తెలిపారు. 30 కిలోల వరి బస్తా రూ.1,200, కిలో కంది(పీఆర్‌జీ176) రూ.120, కిలో పెసర(డబ్ల్యూజీజీ42) రూ.125తో అందజేస్తారన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు 7013571755, 7032058368, 9493344440 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

మణిపూర్ పాపం బీజేపీదే

కళ్యాణదుర్గం: మణిపూర్ రాష్ట్రంలో జరిగిన హింసకాండను ప్రజలు వ్యతిరేకించాలని, ఆ పాపం బీజేపి పార్టీదేనని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పార్వతిప్రసాద్, పద్మావతి అన్నారు. మణిపూర్‌లో మైనార్టీ మహిళలపై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం స్థానిక టీ సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ బీజేపీ దేశ వ్యాప్తంగా మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. మణిపూర్‌లో మైనార్టీలుగా ఉన్న కుకి అనే గిరిజన ప్రజల మీద హింసాత్మక దాడులు దిగడం హేయమైన చర్య అన్నారు. దారుణాలను పరిశీలించడానికి వెళ్లిన జాతీయ మహిళా నేతలపై అక్రమ కేసులు పెట్టడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి, కవిత, నాయకులు హసీనా బేగం, కుషిత బేగం, గౌరవాధ్యక్షులు కమ్మక్క, యశోదమ్మ, లలితమ్మ, జయమ్మ, సునీత, ఈరక్క, గౌరమ్మ, హసీనా, రేవతి తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల వంశపారంపర్య హక్కులపై హర్షం


మాట్లాడుతున్న ద్వారకానాథచార్యులు

ఉరవకొండ: అర్చకులకు మేలు జరిగేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయానికి మంత్రివర్గం ఆమోదం తెలపడంపై అర్చక సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ద్వారకానాథచార్యులు హర్షం వ్యక్తం చేశారు. అర్చక సంఘం జిల్లా కోశాధికారి మయూరం బాలాజీ, సభ్యులు గుండురావు, సత్యనారాయయణ, రామకృష్ణ రావుతో కలసి శనివారం పెన్నోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్చక వృత్తికి బ్రాహ్మణులు దూరమవుతున్న తరుణంలో వంశపారంపర్య హక్కులను కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం అందరికీ ఆమోదయోగ్యమైందేనన్నారు. అర్చకుల జీతాల పెంపు నిర్ణయం కూడా ఎంతో గొప్పదన్నారు. అర్చకుల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్, మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవాదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్‌కు అర్చక సమాఖ్య తరపున కృతజ్ఞతలు తెలిపారు.





















నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

రాయదుర్గం రూరల్: మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామంలో ఆదివారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీపీ విద్యావతి, ఎంపీడీఓ కొండయ్య శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 6.30 గంటలకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నేతృత్వంలో కార్యక్రమం ప్రారంభిస్తారన్నారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరిస్తారన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వారు కోరారు.





ఎస్టీ గురుకుల పాఠశాల తనిఖీ

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడు వద్ద ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలను శనివారం ఎంఈఓ(2) తిమ్మప్ప తనిఖీ చేశారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.అనంతరం తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించాలని సూచించారు.అనంతరం స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చేపట నాడు–నేడు పనులను పరిశీలించి, పనులు వేగవంతం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సీఆర్పీ ఓబుళపతి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొర్రకోడు వీఆర్ఓగా నాగన్న

కూడేరు: మండలంలోని కొర్రకోడు వీఆర్ఓగా నాగన్న శనివారం బాధ్యతలు చేపట్టారు. నాగన్న వజ్రకరూరు మండలం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న వీఆర్ఓ నాగరాజు అక్రమాలకు పాల్పడడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం విదితమే.

నేడు ఓబుళేసు సంస్మరణ సభ

ఉరవకొండ: స్థానిక ఉరగాద్రి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 10 గంటలకు పార్టీ పట్టణ కన్వీనర్ చల్లా బ్యాంకు ఓబుళేసు సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ రూరల్ కన్వీనర్ వెలిగొండ నరసింహులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రమణ హాజరవుతారన్నారు.

'రజక సదస్సుకు తరలిరండి'

కూడేరు: అనంతపురం పట్టణంలో ఈ నెల 21న రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర సదస్సును నిర్వహించనున్నట్లు రజక వృత్తిదారుల రాష్ట్ర నేత లింగమయ్య తెలిపారు. శనివారం కూడేరులో ఆయన రజకులతో కలిసి రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సదస్సులో రజకుల సమస్యలు, రాజకీయ ప్రాధాన్యతపై చర్చిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా రజకులు తరలివచ్చి సదస్సును విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు నాగప్ప, ఈశ్వరయ్య, ఓబుల నాయుడు, సంగప్ప, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.





